ధానిక:

# వ్యాపారం

## 'జగన్నాథ్'

ఒకప్పుడు వెంకటశివుడి తండ్రి బాగా ఉన్నవాడే. అతనికి నలభై అయిదేళ్లప్పుడు మొదటి భార్య పోయింది. ఆవిడ నతను బాగా ప్రేమించేవాడని పేరు. అది ఆవిడ పోయాకే ప్రచారంలోకి వచ్చిందో, బ్రతికున్నప్పుడే వచ్చిందోమాత్రం నాకు తెలియదు. కాని పెళ్ళాం పోయిన యేడాదివరకూ అత నించుమించు వైరాగ్యదశలోనే వున్నాడని చెప్పవచ్చు. ఎన్ని సంబంధాలు వచ్చి నాతో సెసేవాడు, ఎందు రెన్నివిధాలా చెప్పినా వినేవాడు కాదు. బహుశా చచ్చిపోయిన భార్యమీద వుండే మమకారంవల్ల నయివుండవచ్చు. అయితే, ఇంకొక యేడాదికే మర్గాంలో అతనికున్న భూమి కాస్తా అమ్మడై పోయింది. వెంకటశివుడి తండ్రి భూమి అమ్మేస్తున్నాడని తెలిసినప్పుడు చాలామందికి ఆశ్చర్యం వేసింది. అప్పటిలో అతనికి చెడ్డ అలవాట్లున్నాయని వూహించడానికైనా ఎవరికీ ధైర్యం లేకపోయింది. అకస్మాత్తుగా అతను తాగుతున్నాడనీ తిరుగుతున్నాడనీ తెలిసినప్పుడు ఊరంతా ఒక్కసారి ఊగిపోయింది. వెంటనే కొందరు పెద్దలు పట్టుబట్టి ఆతనికి పెళ్లిసంబంధం కుదిర్చేశారు. కిక్కురుమనకుండా అతను పెళ్లిచేసివేసుకున్నాడు. తరువాత రెండేళ్లకి వెంకటశివుడు పుట్టాడు. అప్పటికే ఆకుటుంబం పూర్తిగాచితికిపోయింది. అక్కడక్కడా మిగిలివున్న భూమి సొంతంగా అమ్ముడైపోయింది. సొంతయింట్లోనుంచి అంతకంటే చిన్నదైన అద్దెకొంపలోకి మారవలసివచ్చింది. వెంకటశివుడి తండ్రి రోజూ పట్టణం వెళ్లి డబ్బు తెస్తూ వుండేవాడు. కాని దానితోనే వాళ్లు సంసారం గడుపుకుంటున్నారని చెప్పడం సమంజసంగా వుండదు. భర్త కాళ్లీడ్చుకొంటూ నాలుగు మైళ్లు కాలినడకని వెళ్లి పట్టణంలో సంపాదించే దానికంటే ఎక్కువగా భార్య ఇంటిదగ్గర వుండే సంపాదించగలిగేది. పేదరికం భరించలేక అవవచ్చు, కామం భరించలేక అనవొచ్చు వెంకటశివుడి తల్లి ఈవిధంగా డబ్బు చేయడం నేర్చుకుంది. ఈవిషయం అతని తండ్రికి తెలియదనుకోడంకూడా పొరబాటే అవుతుంది. అతను ఇంటి ఖర్చుకి ఒక్కదమ్మిడీ యిచ్చేవాడు కాదు. పైగా అవసరమైనప్పుడు పెళ్లాందగ్గిరనుంచి రూపాయి అర్థా పుచ్చుకుంటూ వుండేవాడు. వీళ్ల దాంపత్యాన్ని చూసి వీళ్ల కొక్క నిముషమైనా మనశ్శాంతి వుంటుందా అని అనుమానపడేవాళ్లు చాలామంది ఉండడానికి అవకాశాలున్నాయి కాని కొంచెం పరీక్షగా చూసినట్టయితే అంతకంటే సంతోషంగా ఉండే భార్యాభర్తలు మనకి కనుపించరు. ఎప్పుడూ వాళ్లిద్దరిమధ్యా అభిప్రాయ భేదాలూ, దెబ్బలాటలూ వుండేవి కావు. వాళ్లిద్దరూ దెబ్బలాడుకుని విడిపోవడం చూసి ఆనందించాలని ఎవ్వరికీ లేకపోయినా వాళ్లసంసారం ఒడుదుడుకులేకుండా శాంతంగా సాగిపోడం కూడా చాలామందిచూసి సహించలేకపోయారు. కొందరు భార్యసంగతి అతనికి తెలియనట్టుగా చెప్పడానికికూడా సాహసించారు. అయితే వెంకటశివు డెప్పుడూ కోపం తెచ్చుకున్నట్టు కనబడేవాడు కాదు. "అంతా అబద్ధం, పెళ్లం సంగతి నాకు తెలుసు, అది చాలా మంచిది" అంటూ ఉండేవాడు. దీనితో వాళ్ళనోళ్ళు కట్టుబడి పోయేవి. కొంతకాలానికి నిజంగా ఆవిడ పతివ్రత అని ప్రచారంచేసేవాళ్లు కూడా బయలుదేరారు. ఏది ఎలా జరుగుతున్నప్పటికే వెంకటశివుడి తల్లి ఏమీ జరగనట్టుగానే ప్రవర్తించేది. ఇరుగుపొరుగువారు కూడా ఏమీ కంగారుపడకుండా ప్రతి పండగకీ పబ్బానికీ ఆవిడని పిలుస్తూనే వుండేవారు. ఇలా సంతోషంగా గడిచిపోతున్న సంసారానికి వెంకటశివుడి పుట్టుక ఒక నిరోధంగా కనిపించింది. నిజానికి అతని తల్లిగాని తండ్రిగాని సంతానం కోసం తపించిపోలేదు. అందుచేత ఆతని పుట్టుక సంతోషకరంగా పరిణమించలేక పోయింది. చంటిపిల్లవాడికోసం ఖర్చుబెట్టడంలో అతని తల్లి ఆట్టే కష్టపెట్టుకోకపోయినా, పిల్లని పెంచడం ఆవిడకి మించినపనయింది. అతనికి తిండీ, బట్టా, అన్నీ సక్రమంగా లభిస్తున్నప్పటికీ ఎప్పుడూ సంతోషంగా కనిపించేవాడు కాదు. సరిగ్గా బడికి వచ్చేవాడు కాదు. అందరితోటీ స్నేహంగా వుండేవాడు కాదు. అసలు అందరూ ఇతనిలో స్నేహంగా వుండేవారు కాదు. కొత్తవాళ్ళంటే వెంకటశివుడికి భయం, అసహ్యం, ద్వేషం. ఇతనన్నా తక్కిన కుర్రవాళ్లకి అలాగే వుండేది. మొదటిలో నన్నూ ఇలాగే అనుమానంగా చూసేవాడు. అప్పటికి నాసంగతి సందర్భాలతనికి పూర్తిగా తెలియవు. అందరిలాగే స్నేహంగా వున్నట్టే నటించి నాలుగురోజులు పోయినతరువాత నలుగురిలోనూ ఏడిపించడం మొదలుపెడతానేమోనని భయపడ్డాడు. కాని నేను అతనిలాగే ఒక నిర్భాగ్యురాలి కొడుకునని తెలుసుకున్నప్పుడు పరమానందంతో స్వీకరించాడు. అయితే మా అమ్మకి ప్రస్తుతం భర్తఅనేవాడు ఎవడూ లేరు. తొమ్మిదిపదేళ్ళక్రితం ఒక మహానగరంలో అమ్మని నమ్మించి ఒకడు మోసంచేసి వెళ్లిపోయాడు. అప్పటిమంచీ మా అమ్మ మళ్లీ పెళ్ళివిషయం ఎత్తలేదు. ఈ చిన్నవూళ్లోకి వచ్చి మా సిగ్గుని మరుగుపరుచుకుందామని చూశాం. కాని అది ఎక్కడా దాగదు! నేనే చెప్పడం బాగుండదేమో కాని మా అమ్మలాగ నీతిగా నడుచుకునేవాళ్ళు ప్రపంచంమీదే చాలా తక్కువ. అయినా మమ్మల్ని ఎవ్వరూ వాళ్ళయిళ్లకి పిలవరు, గౌరవంగా మాట్లాడినట్టు కనబడరు. మనసులో ప్రతివారికీ మేమంటే చాలాగౌరవం అని నా అనుమానం. లేకపోయినట్టయితే ఈపాటికి మేమా వూరునుంచి వెళ్ళిపోయివుండేవాళ్లం. సామాన్యంగా మావంటి వాళ్లని అనేమాటలు చిన్నలుకాని పెద్దలుకాని ఆవూళ్లో మమ్మలి ననరు. ఇంతకీ నాకూ, వెంకటశివుడికీ ఈ ఒక్కవిషయంలోమాత్రమే దగ్గిర సంబంధం. అతను తల్లితండ్రులు కోరకపోయినా పుట్టాడు. అందుచేత వాళ్లు ఇతనిని ప్రేమించలేకపోయారు. వెంకటశివుడికికూడా తల్లితండ్రుల మీద చెప్పలేనంత క్రోధం. అసలు ప్రపంచం మీద తల్లితండ్రులంతా కూడా అలాగే వుంటారని ఒక విశ్వాసం. వాళ్ల దౌర్జన్యాలని తీవ్రంగా విమర్శించాలని ఒకవాంఛ! అన్నింటికంటే తల్లితండ్రులచేత ప్రేమించబడాలని అతనికి ఆశగా వుండేది. వారి దృష్టిని తనవైపుకి తిప్పుకోడంకోసం అన్నం సరిగ్గా తినేవాడు కాదు; బట్టలు సరిగ్గా వేసుకునేవాడుకాదు; చెప్పిన పని ఏదీ చేసేవాడుకాదు. నెమ్మదిగా అతను ఒకరిని లెక్కచేయకుండా తయారయ్యాడు. ఊళ్ళో ఎవ్వరన్నా అతనికి భయం లేదు. ఎక్కడ చూసినా వెంకటశివుడు, అతని జట్టు కనిపిస్తూవుండేది. అప్పుడప్పుడు దెబ్బలు తినకూడా ఇంటికి రావడం అతనికి పరిపాటి అయిపోయింది. ఇంక వెంకటశివుడితో పడడం తల్లి శక్యం కాలేదు. ఆవిడ అన్నయ్య ఎక్కడో పట్టణంలో గవర్నమెంటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతనిదగ్గిరకి కొడుకుని పంపించివేసింది. కొంతకాలం వెంకటశివుడికక్కడ సుఖంగానే గడిచింది. అతని చరిత్ర నెరుగున్న వాళ్లుకాని, ఏడిపించేవాళ్లు కాని అక్కడ లేరు. అయినా అతను పట్టణంలో చాలాకాలం వుండలేకపోయాడు. మేనమామ ఇంట్లో మూడు పూట్లూ భోజనం తప్పితే చేతికి ఒక్కచిల్లు గవ్వయినా దొరికేది కాదు. అదయినా వేళకి సరిగ్గా అన్నం తిని, చదువుకుని, నిద్రపోవాలి అల్లరిచిల్లరగా తిరగడానికే మాత్రమూ అవకాశ ముండేదు. పైగా మేనత్త సాధింపులు, తిట్లుపడడం వెంకటశివుడికలవాటు లేని పని. ఒకళ్లని తిట్టడం, ఎదిరించడం వీటికే అలవాటుపడ్డాడు. కాని ఒకళ్లచేత తిట్టించుకోవడం అతనికి కొత్త. కొంపతీసి ఏమైనా నోరు జారాడా రాత్రికి మామయ్యచేత దెబ్బలు తప్పేవి కాదు. ఇటువంటి పరిస్థితులలో సైతం వెంకటశివుడు కొన్ని ఏళ్లు గడపగలిగాడు. ఒకరోజున మేనమామపెట్టిలో పది రూపాయిల నోటు పోయింది అది మామకొడుకు తీయడం ప్రత్యక్షంగా వెంకటశివుడు చూశాడు. కాని నిజం చెప్పబోతే అది తనమీదే బెడిసికొట్టింది. ఆవాళ తిండి పెట్టకుండా స్తంభానికి కట్టికొట్టేటప్పటికి ఇన్నాళ్లనుంచీ అతనిలో అజ్ఞాతంగా అణగివున్న అభిమానం ఒక్కసారి పైకి లేచింది. ఆరాత్రే అతను వూరు వదిలిపెట్టి పారిపోయాడు. నిజంగా అతనికోసం విచారించినవాళ్లుకాని, అత నెక్కడ వున్నాడో వెతికించినవాళ్లు కాని లేరనే చెప్పవచ్చు. అసలు, ఈవిషయం మావూరుపాకేటప్పటికే అతను పారిపోయి వారం గడిచింది. అప్పుడలా వెళ్ళిపోయిన వెంకటశివుడు మళ్లీ పాతిక సంవత్సరాలకి ఒక లక్షరూపాయిల ఆస్తితో అసలు వూళ్ళ ప్రవేశించాడు. మేమెవ్వరమూ మొగటిలో అతని నానవాలుపట్టలేకపోయాం. నేనూ, కరణం, మీసాలకాపూ, మునసబు అరుగుమీద కూర్చుని ఆప్తులలాగ మాట్లాడుకొంటున్నప్పుడతను వచ్చి వెంకటశివుడి నని తెలియజేసుకున్నప్పుడు ఆశ్చర్యపోయాం. నేనలా వాళ్లలో సమానంగా కూర్చుని మాట్లాడుతున్నందుకు అతనుకూడా ఆశ్చర్యపడ్డట్టే కనిపించాడు. అతను ఊరు విడిచి వెళ్ళిపోయిన ఈ పాతికేళ్లల్లోనూ చాలా మార్పులు జరిగాయి. అతని తల్లితండ్రు లిద్దరూ చచ్చిపోయారు. నేను ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోయి, పట్టణంలో వ్యాపారంచేసి లక్షరూపాయలపైచిలుకు కూడబెట్టాను. అందుచేత మాపాతమచ్చ మాయమయిపోయింది. సరిగ్గా వెంకటశివుడు వచ్చినరోజునే మునసబుకొడుకుపెళ్లికి కుటుంబంతో సహా వచ్చాను. మా స్నేహం విడిపోయి పాతికసంవత్సరాలు కావస్తున్నప్పటికీ, మా స్థితిగతులలో ఇంత భేదం వచ్చినప్పటికే ఒకరినొకరు కలుసుకున్నప్పుడు ఒక్కక్షణంలో చిన్నప్పటిలాగే ఐక్యమై పోగలిగాం. ఇద్దరమూ అలాగ పొలాలలోకి వెళ్ళి ఎన్నో సంగతులు మాట్లాడుకున్నాం. ఇంత డబ్బు అత నెలా గడించాడో నే నడగలేదు. అతనూ చెప్పలేదు. కాని ఇద్దరం కలిసి పట్టణంలో ఒక కొత్త వ్యాపారాన్ని ప్రారంభించడానికి మాత్రం స్థిరపరుచుకున్నాం.

మరునాడే పట్టణంలో మాయింటిపక్కన ఒక యిల్లు కుదిర్చిపెట్టా నతనికి. ఆవాళే కుటుంబాన్ని తీసుకువచ్చేస్తానని బయలుదేరాడు. కొంచెం మంచి రోజు చూసి తీసుకురావయ్యా అంటే నాకు వీటిల్లో నమ్మకం లేదు, పొమ్మన్నాడు. ఎలాగో వప్పించి రెండు రోజులపాటు అతని కుటుంబాన్నంతా మాయింట్లోనే వుంచి మూడోనాడు ప్రవేశపెట్టాను. మునపటికీ యిప్పటికే వెంకటశివుడిలో చాలా మార్పు కనిపించింది. అప్పటిలాగ అత నెవరికీ భయపడడు. పైగా నీతినియమాలగురించి మాట్లాడేవాళ్లని చులకనగా చూస్తాడు. ప్రపంచంలో ఎవ రేమయిపోయినా సరే తన కుటుంబం, తన భార్య, తనపిల్లలు, తిన తిండి, అంతా తన విషయమే అతనికి కావలసింది. ఒకప్పుడు వెంకటశివుడిని ఎవరూ లెక్కచేసేవారు కాదు. ఇప్పుడతనే ఎవరినీ లెక్కచేయకపోవడం నేర్చుకున్నాడు.

వెంకట శివుడికి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు మద్రాసులో వకీలు చేస్తున్నాడు. పెద్ద కొడుకుగురించి అత నెంతో పొగిడి చెబుతూ వుంటాడు. చిన్నప్పుడు పుట్టిందిమొదలు ఎలా పెరిగిందీ, ఒక్కొక్క క్లాసూ ఎలా పాసయిందీ, చదువుకునే రోజులలో ఆటలలో అతని కెన్ని బహుమానాలు వచ్చిందీ విడివిడిగా ఉద్రేకంగా చెప్పుతూ వుంటాడు. ఎందరిదగ్గర ఏకరువుపెట్టినా అతనికి విసుగు అనేది లేదు. ఒక్కొక్కప్పుడు చెప్పినవాళ్లకే మళ్లీ చెప్పతాడు అటువంటి ప్రయోజకుడు తనకడుపున పుట్టినందుకు జన్మ సార్థకమైనట్టు మాట్లాడుతాడు. అతనిని తలుచుకుని గర్వపడతాడు, ఆనందపడతాడు. తక్కిన యిద్దరూకూడా అలా తయారయితే ఇంక తనకే బెంగా వుండదంటాడు. సాధారణంగా రెండో కొడుకుసంగతి మూడోకొడుకు సంగతి కొత్తవాళ్లదగ్గిర ఎత్తనే ఎత్తడు. వాళ్లమాట వచ్చినప్పుడు అతను నిజంగా బాధపడతాడు.

అతని రెండో కొడుకు ఇంట్లోనుంచి పారిపోయాడు. వెంకటశివుడికి నీతినియమాలను గురించి అదే పనిగా మాట్లాడేవాళ్లని చూచినప్పుడు అసహ్యం వేసినా అవి పాటించనివాళ్లని చూచినప్పుడు అపరిమితమైన కోపం వస్తుంది. అతను చిన్నతనంలో స్వయంగా అనుభవించిన బాధ ఇంకొకళ్లకి రాబోతూందని తెలిసినప్పుడు చెప్పలేనంతగా కుమిలిపోతాడు. అందుచేతనే తన పిల్లలని చిన్నతనంనుంచీ మంచి కట్టుదిట్టాలలో వుంచాడు. ఎప్పుడు ఏ విధంగా కొడుకులతో మాట్లాడినా ఇంద్రియనిగ్రహం ఎంత గొప్పదో చూచాయగా తెలియచేస్తూ వుండేవాడు. ఫలితంగా అతని రెండోకొడుకు వెంకటశివుడి మనస్సుకి శాంతి లేకుండాచేశాడు. తండ్రిరక్షణలో వున్నంతసేపూ అతను బాగానే వున్నాడు. కాని వూరు విడిచి కాలేజీలోకి వెళ్లాక అతనిగురించి చాలా చెడ్డ సంగతులు వాడుకలోకి వచ్చాయి. క్లాసు ఆడపిల్లలపట్ల అత్యాచారంగా ప్రవర్తిస్తున్నాడనికూడా కొన్నిసార్లు తండ్రిచెవున బడింది. దానికితోడు అతను చదువు పూర్తిచేసి ఇంటికి వచ్చేస్తూ ఒక ఆడపిల్లనితీసుకువచ్చి పెళ్లిచేసుకుంటానన్నాడు. అలా వీలులేదని శివుడు గట్టిగా చెప్పివేశాడు. అంతే కాకుండా నలుగురి ఎదుటా నాలుగు చివాట్లు పెట్టాడు. తెల్లవారేటప్పటికి కొంత డబ్బుతో కొడుకూ, కొత్త అమ్మాయి మాయమయి పోయారు.

ఇంక మూడోవాడివిషయంకూడా విషమంగానే పరిణమించింది. అతను కొంచెం మందబుద్ధి. ఏ విషయంకూడా చురుకు అర్థం చేసుకునే శక్తి అతనికి లేదు. అసలు అతనికి ప్రత్యేకమైన అభిరుచులుంటూవుండేవి. తనికి తోచింది తప్పితే ఇంకొకటి ఎవ్వరు చెప్పినా చెయ్యడు. వెంకటశివుడికిమాత్రం కొడుకు నేదో చేసేయాలని వుండేది. తన శక్తినంతా వినియోగించి అయినా సరే, కొడుకుని వకీలు చేయడానికి ప్రయత్నించాడు. అతను మొదటినుంచీ లా చదవననే అంటూవచ్చాడు; కాని తండ్రి బలవంతంమీద లాకాలేజీలో చేరవలసివచ్చింది; యఫ్. యల్. లో రెండేళ్లు కూర్చోవలసీ వచ్చింది. ఎన్నిసార్లుపోయినా అతను కష్టపడి చదివేవాడు కాదు. ఊరికనే పరీక్షలకి కూర్చుని వచ్చేసేవాడు. చివరికి విసుగెత్తి కట్టడం మానేశాడు. వెంకటశివుడు కూడా కట్టమని బలవంతం చేయలేదు. నేనే ఒకరోజున కుర్రవాడిని పిలిచి యం.ఏ. చదవకూడదా అనిఅడిగాను. తప్పకుండా లిటరేచర్ యం. ఏ. చదువుతా నన్నాడు. నేనీ సంగతి వెంకటశివుడితో చెప్తే ఇంకతను కొడుకుని చదివించదలుచుకో లేదని స్పష్టంగా చెప్పివేశాడు. ఎంత చదివినా చేసే పని ఏమీ లేదు. కాబట్టి ఇంక ఆట్టే ఖర్చుపెట్టకుండా ఇంట్లో కూర్చుని తింటూ వుంటేనే బాగుంటుందన్నాడు.

వెంకటశివుడి తత్త్వం నే నర్థం చేసుకోగలిగాను. ప్రపంచంలో ప్రతివిషయాన్నీ వ్యాపారదృష్టితో చూడడం అలవాటు చేసుకున్నాడతను. పెద్దకొడుకుమీద కొంత పెట్టుబడి పెట్టాడు. లాభించింది. అతదుచేత అదే పనిగా అతనిని పొగడగలుగుతున్నాడు. రెండోవాడికి ఖర్చుపెట్టిందంతా వ్యర్థమై పోయింది. మూడో కొడుకుమీద కూడా అతనికి నష్టమే వచ్చింది. ఇప్పటివరకూ తను చదివించిందానికి ఫలితంగా ప్లీడరీ చేసి డబ్బు సంపాదిస్తాడనీ, తన పేరు నిలబెడతాడనీ ఆశించాడు. కాని అది ఫలించదని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాడు. ఇప్పటికే కొంత నష్టపోయాడు కనుక యింకా దానిలోనే ప్రయత్నించి మరికొంత నష్టపోవడానికి అతని మనస్సు వప్పుకోలేదు!

—